క్లుప్తంగా

అభినందనలు


మిస్ ఆంధ్రప్రదేశ్ విజేత వాణిని అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: ఈ నెల 15న హైదరాబాద్ వేదికగా నిర్వహించిన అందాల పోటీల్లో విజయనగరానికి చెందిన ఎం.వాణి మిస్ ఆంధ్రప్రదేశ్‌గా నిలిచింది. ఈ నేపథ్యంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిని శుక్రవారం ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. 300 మంది పాల్గొన్న పోటీల్లో వాణి విజేతగా నిలవడంపై డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, ఆమెను అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

నైతిక విలువలపై అవగాహన తప్పనిసరి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రసాదరావు

విజయనగరం ఫోర్ట్: నైతిక విలువలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ప్రసాదరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంఆర్ కళాశాలలో నైతిక విలువలపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచే పిల్లలకు నైతిక విలువల గురించి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌరి, తదితరులు పాల్గొన్నారు.

విజయలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు


అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గంగానగర్‌లో ఉన్న శ్రీ క్షేత్రమ్‌లోని అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరుని దేవాలయంలో కొలువైన విజయలక్ష్మి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రమేష్ ఆచార్యులు, శ్రీనివాస్ రమేష్ ఆచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి స్నపనం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

నిరసన


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పూసపాటిరేగ: దళిత, పేద వర్గాలపై మాజీ సీఎం చంద్రబాబునాయుడు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం సాయంత్రం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు మాట్లాడుతూ, మాజీ సీఎం చంద్రబాబునాయుడు అట్టడుగువర్గాలను హేళన చేయడం క్షమించరాని నేరమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, టొంపల సీతారాం, కొత్తకోట శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర దీపారాధన


రామతీర్థంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ సేవను ఆలయ అర్చకులు శుక్రవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. తూర్పు రాజగోపురం సమీపంలోని వేదికపై ఉన్న ప్రత్యేక ఊయలలో సీతారామచంద్రస్వామిని ఆశీనులు చేసి సహస్ర దీపాల కాంతుల శోభలో స్వామికి పవళింపు జరిపించారు. సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు భక్తి శ్రద్ధలతో దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, రామగోపాలా చార్యులు పాల్గొన్నారు.

సుర్రుమంటున్న సూరీడు

- రోజురోజుకూ పెరుగుతున్న ఎండలు
- ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు
- నిర్మానుష్యంగా మారుతున్న రోడ్లు


భోగాపురంలో నిర్మానుష్యంగా మారిన జాతీయ రహదారి

భోగాపురం: వేసవి ఎండల తీవ్రత రోజు రోజుకూ పెరుగుతోంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఉక్కబోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం 9 గంటలకే భానుడు ఉగ్రరూపం దాలుస్తుండడంతో బయటకు రావడానికి కూడా ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. దీంతో రహదారులన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. సాయంత్రం 5 గంటలు దాటిన తర్వాత కూడా ఉష్ణోగ్రత ప్రభావం ఏమాత్రం తగ్గడం లేదు. నిత్యం 40 నుంచి 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదైంది. జాతీయ రహదారిపై ఆ సమయంలో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. ఆర్టీసీ బస్సులు, మినహా లారీలు, ఆటోలు కూడా పెద్దగా రాకపోకలు సాగించకపోవడంతో భోగాపురం, సవరవిల్లి, రాజాపులోవ కూడళ్లు జనసంచారం లేక నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి.

వ్యాపారాలు సాగడం లేదు

వేసవికాలంలో కూల్‌డ్రింక్స్, జ్యూస్‌లు, చెరుకురసాలకు ఎక్కువ డిమాండ్ ఉంటుంది. అయితే ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తప్పనిసరైతే గాని జనం బయటకు రావడం లేదు. దీంతో తమకు బేరాలు పెద్దగా ఉండడం లేదని వ్యాపారులు చెబుతున్నారు.

వడగాల్పులతో జాగ్రత్త

ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ తగిలే అవకాశాలుంటాయి. వీలైనంత వరకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు వరకు బయట తిరగకపోవడం మంచిది. శరీరం డీ హైడ్రేషన్‌కు గురికాకుండా తరచూ నీరు, గ్లూకోజ్ వాటర్, కొబ్బరి నీళ్లు, చెరుకురసం, బార్లీ నీరు తాగుతుండాలి.

– తిరుపతిస్వామి, వైద్యుడు, పోలిపల్లి పీహెచ్‌సీ

గ్రంథాలయానికి కుర్చీలు, ఫ్యాన్ల వితరణ


లైబ్రేరియన్ మహేష్‌కు ఫ్యాన్లు, కుర్చీలు, ట్యూబ్‌లైట్లను వితరణగా అందిస్తున్న రొంగలి బంగారుబాబు

డెంకాడ: మండలంలోని డెంకాడ శాఖా గ్రంథాలయానికి గ్రామానికి చెందిన రొంగలి బంగారుబాబు పలు రకాల సామగ్రినికి వితరణగా అందించారు. ప్రస్తుతం గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరవుతుండడంతో దాతలు తమకు తోచిన సాయాన్ని అందిస్తున్నారు. దీనిలో భాగంగా డెంకాడకు చెందిన రొంగలి బంగారుబాబు ఐదు కుర్చీలు, రెండు సీలింగ్ ఫ్యాన్లు, రెండు ట్యూబ్‌లైట్స్ సెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ వై.మహేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల: నగరంలోని సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో 88 సీట్లు చొప్పున అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఎంఅండ్‌ఏటీ, ఈఈటీ, సీటీ, ఏఅండ్‌టీ, ఎంఎల్‌టీ ఒకేషనల్ గ్రూపుల్లో 40 చొప్పున సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. 2022 – 23 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చేనెల 14 వరకు ప్రవేశాలకు అవకాశం కల్పిస్తామన్నారు.

ప్రజా మద్దతే వైఎస్సార్‌సీపీ బలం

- పారదర్శక పాలనను మరోసారి ఆశీర్వదించండి
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి


సంక్షేమ పథకాలను వివరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రజలందరి మద్దతే వైఎస్సార్‌సీపీ బలమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న పారదర్శక పాలనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. నగరంలోని 30వ డివిజన్ ధర్మపురి బీసీ కాలనీలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోలగట్ల, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరినదీ వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. అందుతున్న ప్రభుత్వ పథకాలపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా మహిళల బ్యాంక్ ఖాతాలకు అమ్మఒడి, ఆసరా పథకాల నగదు నేరుగా జమవుతుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. స్థానిక కార్పొరేటర్ పతివాడ గణపతిరావు మాట్లాడుతూ, తమ డివిజన్‌లో ఏడో రోజు గడప గడపకు మన ప్రభుత్వం జరుగుతోందన్నారు. స్థానిక సమస్యలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పరిష్కరిస్తున్నారని చెప్పారు. శాశ్వత మంచినీటి సమస్య పరిష్కారానికి వాటర్ ట్యాంక్ నిర్మాణం కూడా జరుగుతోందన్నారు. ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నెరవేరుస్తుండడం వల్లే ప్రజాభిమానం ఉప్పొంగుతోందన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, జోనల్ ఇన్‌చార్జ్‌లు మారెం బాల బ్రహ్మారెడ్డి, బొద్దాన అప్పారావు, డివిజన్ ఇన్‌చార్జ్ పూసర్ల శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు చందక ఆదిలక్ష్మి, యువజన అధ్యక్షుడు జయరాం, తదితరులు పాల్గొన్నారు.

సందర్శన


పిల్లలకు దుస్తులు అందజేస్తున్న అప్పారావు

విజయనగరం ఫోర్ట్: కేఎల్‌పురంలో గల శిశుగృహ కేంద్రాన్ని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కేసలి అప్పారావు శుక్రవారం సందర్శించారు. రెండు రోజుల కిందట తల్లిదండ్రుల నిర్లక్ష్యానికి గురైన ఇద్దరి అక్కాచెల్లెళ్లకు పునరావాసం కల్పించడంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎవరైనా తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించడం, పోషించడం, పెంపకం వంటి విషయాల్లో ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో అటువంటి చిన్నారులకు పునరావాసం కల్పించాలన్నారు. అనంతరం పిల్లలకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ హిమబిందు, సభ్యులు సుధారాణి, భవానీ, మిషన్ వాత్సల్య సిబ్బంది నాగరాజు, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి బీచ్ క్లీనింగ్ రేపు


టి.సుదర్శనం, పర్యావరణ ఇంజినీర్

విజయనగరం రూరల్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'మిషన్ లైఫ్' కార్యక్రమంపై ఈ నెల 21న పూసపాటిరేగ మండలం చింతపల్లి బీచ్‌లో సాగరతీర స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించనున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ బి.సుదర్శనం తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రకృతితో మమేకమయ్యే జీవనశైలిని ఏర్పరచుకునే దిశగా ప్రజలను సమాయత్తం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని కట్టడి చేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించడం ద్వారా ప్రకృతికి ఎంతో మేలు చేసిన వారమవుతామన్నారు. సాగరతీర స్వచ్ఛత కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులతో పాటు, సమీప గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, యువత ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

దాతల కృషి ఎనలేనిది

- పైడితల్లి అమ్మవారి దేవస్థానం ఈఓ సుధారాణి


ఈఓ సుధారాణికి విరాళం అందజేస్తున్న భక్తులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధికి దాతలు చేస్తున్న కృషి ఎనలేనిదని దేవస్థానం కార్యనిర్వహణాధికారి కేఎల్.సుధారాణి అన్నారు. స్థానిక చదురుగుడి ఆవరణలో శాశ్వత నిత్యాన్నదాన పథకానికి విజయవాడ కృష్ణలంకకు చెందిన భక్తులు పి.జగన్ మోహనరావు లక్ష రూపాయలు విరాళాన్ని ఆలయ సూపర్‌వైజర్ ఏడుకొండలకు శుక్రవారం అందజేశారు. అదేవిధంగా హైదరాబాద్ మల్కాజ్‌గిరి గౌతమ్‌నగర్‌కి చెందిన వారణాశి రాము అనే భక్తుడు అన్నదానానికి రూ. 50 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయ సాధనకు కృషి చేద్దాం

- సీపీఎం జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ


సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు కృషి చేద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. సీపీఎం ఆధ్వర్యంలో కమ్యూనిస్ట్ గాంధీ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి శుక్రవారం స్థానిక ఎల్‌బీజీ భవనంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు అధ్యక్షత ఘనంగా నిర్వహించారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఎం పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ, సుందరయ్య సంపన్న కుటుంబంలో పుట్టి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తన ఆస్తిని వదులుకుని, దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించాడన్నారు. పిల్లలుంటే ప్రజాసేవకు ఆటంకం ఏర్పడుతుందని భావించిన పుచ్చలపల్లి పిల్లలను కూడా వద్దనుకున్నాడని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు పి.రమణమ్మ, నగర కమిటీ సభ్యులు బి.రమణ, సీహెచ్ వెంకటేష్, పార్టీ సభ్యులు డి.రాము, ఆర్.ఆనంద్, హర్ష, రవి పాల్గొన్నారు.

26న కామాక్షి ఆలయ వార్షికోత్సవం

విజయనగరం టౌన్: పట్టణంలోని బొండాడవీధిలో గల శ్రీ మహాగణపతి, కామాక్షీ సమేత ఏకాంబరేశ్వర స్వామి దేవాలయం చతుర్థి వార్షికోత్సవం ఈ నెల 26న ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సోమరాజు తెలిపారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో శుక్రవారం వార్షికోత్సవ ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. ఆ రోజు ఉదయం ఆరు గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, అమ్మవారికి 108 చీరలతో అలంకరిస్తామని చెప్పారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: కారు ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన రెడ్డి గణేశ్వరరావు (55) రోజు కూలీ పనుల నిమిత్తం విజయనగరంలోని ప్రదీప్‌నగర్‌లో ఒకరి ఇంటిలో పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో రోడ్డుపక్కనున్న చెట్టు కింద నిద్రపోయాడు. ఆ సమయంలో ధర్మపురి నుంచి ప్రదీప్‌నగర్ వైపు వస్తున్న కారు అతడి పైనుంచి వెళ్లింది. దీంతో తీవ్ర గాయాలపాలైన గణేశ్వరరావును డ్రైవర్ తన కారులోనే తీసుకెళ్లి మెడికవర్ ఆస్పత్రిలో చేర్పించాడు. చికిత్స పొందుతూ రాత్రి 8 గంటల ప్రాంతంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్సై రామగణేష్ తెలిపారు.

నేడు వలంటీర్లకు అవార్డుల ప్రదానం

విజయనగరం: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అధికారులు, ప్రజల మధ్య వారధిలా కీలక పాత్ర పోషిస్తున్న వలంటీర్లకు మూడు విభాగాల్లో అవార్డులు ప్రదానం చేయనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం అవార్డుల ప్రదానోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలో 1150 మంది వలంటీర్లు సేవలందిస్తుండగా... అందులో ఏడాది కాలం పాటు ఉత్తమ సేవలందించిన 957 మంది వలంటీర్లు ఈ ఏడాది అవార్డులకు ఎంపికైనట్లు తెలిపారు. ఇందులో సేవావజ్ర అవార్డులకు కంది. శివశంకర్, అంబటి పరమేశ్వరరావు, రాజేశ్వరి అర్హత సాధించగా... సేవారత్న అవార్డులకు మరో 10 మంది ఎంపికయ్యారని తెలిపారు. సేవామిత్ర అవార్డులకు 974 మంది అర్హత సాధించినట్లు చెప్పారు. సేవావజ్రకు ఎంపికైన వారికి రూ.30 వేలు, సేవారత్నకు ఎంపికైన వారికి రూ.20 వేలు, సేవామిత్రలకు రూ.10వేలు చొప్పున నగదు ప్రోత్సాహకం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

వలంటీర్లకు పురస్కారాలు

పూసపాటిరేగ: ఈనెల 20వ తేదీ నుంచి 27 వరకు వలంటీర్లకు పురస్కారాలు అందజేయనున్నట్లు ఎంపీడీఓ జి. రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20న కుమిలి-1, కుమిలి-2, రెల్లివలస, చల్లవానితోట.. 22న కొప్పెర్ల, కోనాడ, వెల్దూరు, తిప్పలవలస.. 23న పూసపాటిరేగ -1, పూసపాటిరేగ -2, సీహెచ్ అగ్రహారం, కనిమెల్ల.. 25న కందివలస, గోవిందపురం, కొల్లాయివలస, పతివాడ.. 26న పేరాపురం, వెంపడాం, గుంపాం.. 27న చౌడువాడ, చింతపల్లి-1, చింతపల్లి-2 గ్రామాలలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వలంటీర్లకు వందనం..


ముంజేరు సచివాలయలంలో వలంటీర్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి


వలంటీర్లకు వందనం కార్యక్రమం ప్రారంభోత్సవంలో భాగంగా ముఖ్యమంత్రి ప్రసంగాన్ని వీక్షిస్తున్న ఎంపీడీఓ, వలంటీర్లు, తదితరులు

డెంకాడ: వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ ప్రసారాలను ఆయా సచివాలయాల్లో అధికారులు, సిబ్బంది, వలంటీర్లు తిలకించారు. జొన్నాడ గ్రామ సచివాలయంలో సీఎం లైవ్ కార్యక్రమాన్ని ఎంపీడీఓ స్వరూపారాణి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తిలకించారు.

ఫ్యామిలీ డాక్టర్ పరిశీలన..

గుండాలపేట గ్రామంలో జరిగిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా రోగులకు డెంకాడ పీహెచ్‌సీ డాక్టర్ పావని వైద్య సేవలు అందించారు. కార్యక్రమాన్ని ఎంపీడీఓ స్వరూపారాణి పరిశీలించారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

భోగాపురం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు అందజేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి తెలిపారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ముంజేరు పంచాయతీ పరిధిలోని ప్రజలకు ఉత్తమ సేవలందించిన 22 మంది గ్రామ వలంటీర్లను సచివాలయ కార్యాలయంలో శుక్రవారం సన్మానించారు. వారికి సేవామిత్ర సర్టిఫికెట్లతో పాటు రూ.10 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ పూడిక నూకరాజు, వైస్ సర్పంచ్ పిడుగు ఆదినారాయణ, పిడుగు రాంబాబు, ఎంపీడీఓ దాసరి బంగారయ్య, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలల భిక్షాటన మాఫియాకు అడ్డుకట్ట


బాలల భిక్షాటన మాఫియా నివాసమున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న బాలల హక్కుల కమిషన్ చైర్మన్ అప్పారావు, తదితరులు

విజయనగరం రూరల్: విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలల భిక్షాటన మాఫియాకు బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అడ్డుకట్ట వేశారు. ఇటీవల మండలంలోని విజయనగం మండలం సారిక పంచాయతీ రామనారాయణం సమీపంలో భిక్షాటన చేస్తున్న ఇద్దరు బాలికలను (6 ఏళ్లు, 4 ఏళ్లు) బాలల హక్కుల సంక్షేమ సమితి సభ్యులు గుర్తించి శిశుగృహలో పునరావవాసం కల్పించారు. వారిచ్చిన సమాచారం మేరకు జిల్లా మిషన్ వాత్సల్య, శిశుగృహ సిబ్బందితో పాటు బాలల హక్కుల కమిషన్ చైర్మన్, తదితరులు విజయనగరం మండలం సారిక రోడ్డు నుంచి జొన్నవలస రహదారికి ఆనుకుని ఉన్న రియల్ ఎస్టేట్ లేఅవుట్‌లో ముళ్లపొదల మధ్య గుడారాల్లో ఉన్న భిక్షాటన మాఫియా ప్రాంతానికి శుక్రవారం వెళ్లారు. వీరి రాకను గుర్తించిన భిక్షాటన మాఫియా అప్పటికే అక్కడ నుంచి జారుకున్నారు. భిక్షాటన మాఫియాను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని కేసలి అప్పారావు అన్నారు. శిశుగృహ మేనేజర్ త్రివేణి, మిషన్ వాత్సల్య సిబ్బంది యాళ్ల నాగరాజు, సంధ్య పాల్గొన్నారు.

సీఎం జగన్ పేదల పక్షపాతి


ఇళ్లపట్టాలు అందుకుని జై సీఎం, జై జగన్ నినాదాలు చేస్తున్న లబ్ధిదారులు, నేతలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ అప్పలనాయుడు

- ఎంపీపీ మామిడి అప్పలనాయుడు
- కొండకరకాంలో ఇళ్ల పట్టాల పంపిణీ

విజయనగరం రూరల్: పేద ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కొండకరకాంలో అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా మంజూరైన 148 ఇళ్ల పట్టాలను గ్రామ సచివాలయం కార్యాలయంలో లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ, రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారన్నారు. నవరత్నాల పథకంలో భాగంగా ఇళ్లు లేని పేదలందరికీ ఇంటి స్థలంతో పాటు, ఇంటిని మంజూరు చేశారన్నారు. గత ఎన్నికల హామీల్లో భాగంగా పింఛన్ పథకం, రైతుభరోసా, అమ్మఒడి, రైతు, పొదుపు సంఘాల రుణమాఫీలతో పాటు విద్యాభివృద్ధికి వసతి, విద్యా దీవెన పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కుల వృత్తుల వారికి జగనన్న చేదోడు, చేయూత పథకాలతో పాటు వంద శాతం హామీలను నెరవేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వీటితో పాటు దేశ చరిత్రలోనే మొదటిసారిగా సచివాలయ వ్యవస్థను నెలకొల్పి ఇంటింటికీ ప్రభుత్వ సేవలు అందిస్తున్నారన్నారు. అలాగే గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సచివాలయ భవనాలు, రైతుభరోసా, వెల్‌నెస్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్నింటికంటే ముఖ్యంగా ప్రజల ఆరోగ్య రక్షణకు 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమంతో వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు జై జగన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, జొన్నవలస పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, పంచాయతీ కార్యదర్శి రవి, పార్టీ నాయకులు కిలారి రాంబాబు, బి.ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.